
ఆంధ్రజ్యోతి

andhrajyothy.com



నిజామాబాద్
జిల్లా వార్తలు

5

ఆదివారం 9 నవంబరు 2025

న్యాయ సహాయం.. సామాన్యుడికి భరోసా

- సామన్యుడికి సమన్యాయం అందించడమే న్యాయసేవా సంస్థ ధ్యేయం
- నేడు జాతీయ న్యాయసేవా సంస్థ దినోత్సవం

వివరాలు 7లో..



సండే స్పెషల్
SUNDAY SPECIAL

ఉదయపు నడకతో ఉత్సాహం.. ఆరోగ్యం

- ఆరోగ్య పరిరక్షణకు పెరిగిన ప్రాధాన్యం
- నిజామాబాద్‌లో మార్నింగ్ వాకర్స్ క్లబ్బులు
- ఆదర్శంగా నిలుస్తున్న శ్రీఛత్రపతి శంభాజీ వాకింగ్ గ్రూప్
- క్రమం తప్పకుండా వాకింగ్, వ్యాయామం, యోగా
- వాకింగ్‌కు రాకపోతే ఫైన్లు
- ఆ డబ్బుతో సభ్యుల విహార యాత్రలు
- అవసరమైన వారికి ఆర్థిక సాయం

7

ఉద్యోగం, ఉపాధి బాటలో ఉరుకులు పరుగుల జీవితాలు గడుపుతున్న జనం శారీరక శ్రమకు దూరం అవుతున్నారు. దీనికి తోడు మారిన ఆహారపు అలవాట్లు, జీవన విధానంతో అనారోగ్యం పాలవుతున్నారు. వ్యాధుల బారిన పడి చికిత్స కోసం ఆస్పత్రులకు వెళ్లడం కన్నా, ప్రతీ రోజు ఉదయం కొంత సేపు తమకోసం తాము సమయం కేటాయిస్తున్నారు. 40 ఏళ్లు దాటిన వారు వాకింగ్ క్లబ్‌లు ఏర్పాటు చేసుకుంటున్నారు. క్రమం తప్పకుండా వాకింగ్, యోగా, వ్యాయామం చేస్తూ ఆరోగ్యాన్ని పరిరక్షించుకుంటున్నారు. మూడు, నాలుగు నెలల కోసారి వైద్య పరీక్షలు చేయించుకుంటూ ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

• నిజామాబాద్, ఆంధ్రజ్యోతి ప్రతినిధి

వివరాలు 8లో..

శరీరానికి వ్యాయామం అవసరం



• దుర్గి నరేందర్‌గౌడ్, అధ్యక్షుడు శ్రీఛత్రపతి శంబాజీ వాకింగ్ గ్రూప్

వ్యాయమం ప్రతీ మనిషి జీవితంలో ముఖ్యమైనది ఆరోగ్యం బాగుంటేనే మంచి ఆలోచనలు వస్తాయి. వ్యాయమంతోపాటు సేవా మార్గంలో ప్రయాణించాలన్నదే మాఉద్దేశం. అందుకే ఈ వాకింగ్ గ్రూప్ ఏర్పాటుచేశాం. దేశంపట్ల ప్రేమను ప్రదర్శించడం ప్రతీ పౌరుడి కర్తవ్యం. ఈ గ్రూప్‌కు శ్రీఛత్రపతి శంబాజీ గ్రూప్‌గా నామకరణం చేశాం. ఈ గ్రూప్ ద్వారా వాకింగ్‌తో పాటుశ్రమదానం, దేశభక్తిని పెంపొందించేలా ఆర్ఎస్ఎస్ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నాం.

ఆరోగ్యంగా ఉంటే చాలు..



• పనుసూరి ప్రవీణ్, ప్రధాన కార్యదర్శి, శ్రీఛత్రపతి శంబాజీ వాకింగ్ గ్రూప్

ఈ ఆదునికయుగంలో ఎన్ని డబ్బులున్నా ఆరోగ్యంగా ఉండడమే మహాభాగ్యం. అందుకే ఉదయాన్నే వాకింగ్ చేయడం దినచర్యగా మారింది. వాకింగ్‌కు రాకపోతే ఏదో కోల్పోయినట్లుగా భావిస్తున్నాం. ప్రస్తుతం ప్రతీఆహారం మందులతో తయారవుతున్న క్రమంలో ఆరోగ్యం ప్రతీఒక్కరికి అవసరంగా మారింది. వ్యాయామం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవడమే నేటి పరిస్థితుల్లో అత్యంత కీలకం అందుకే ఆరోగ్యంపై దృష్టిపెట్టి ఈ గ్రూప్ ఏర్పాటు చేశాం.

శ్రీ ఛత్రపతి శంబాజీ వాకింగ్ గ్రూప్





వాకింగ్ పాల్గొంటున్న గ్రూప్ సభ్యులు

నగరంలోని వినాయక్‌నగర్ ప్రాంతానికి చెందిన శ్రీఛత్రపతి శంభాజీ వాకింగ్ గ్రూప్ తన ప్రత్యేకతను చాటుకుంటుంది. సుమారు 25మంది సభ్యులు కలిగిన ఈ గ్రూప్ ప్రతీ 3వ ఆదివారం లేదా 4వ ఆదివారం ప్రత్యేకంగా అందరూ కలిసి అల్పాహార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ప్రతీ ఆదివారం ఆ ప్రాంతంలోని పార్కులలో శ్రమదానంతోపాటు పర్యవరణాన్ని కాపాడే కార్యక్రమాలు చేస్తున్నారు. గ్రూప్‌లో ఉండే ప్రతి సభ్యుడి బాగోగులను తెలుసుకుంటూ ఎవరికి ఏ చిన్న అవస రం ఉన్నా అందరూ కలిసి సహాయం చేస్తున్నారు. వ్యాయమంతోపాటు దేశభక్తిని, సామాజిక స్పృహను వ్యాప్తి చేస్తున్న ఈ వాకింగ్ గ్రూప్ స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది.



పార్టీ జిల్లా కార్యాలయంలో కేక్ కట్ కాంగ్రెస్ నాయకులు

ఘనంగా సీఎం జన్మదిన వేడుకలు

- రేవంత్‌రెడ్డికి పలువురి శుభాకాంక్షలు
- మండలాల్లో పలు సేవా కార్యక్రమాలు

ఇందూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. సీఎం జన్మదినం సందర్భంగా జిల్లాలోని అన్నిమండలాల్లో కాంగ్రెస్‌శ్రేణులు పలు సేవాకార్యక్రమాలు చేపట్టారు. కాంగ్రెస్‌పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం యువజన కాంగ్రెస్ జిల్లాఅధ్యక్షుడు విపుల్‌గౌడ్ ఆధ్వర్యంలో సీఎం జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసిన నాయకులు సీఎంకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పీసీసీ అధ్యక్షుడిగా తక్కువ సమయంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చి రెండేళ్లలో రాష్ట్రంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి దేశంలోనే ఆదర్శంగా నిర్వహిస్తున్న ఘనత రేవంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రమోద్, విజయపాల్‌రెడ్డి, బీఎల్‌రాజు, నరేందర్‌గౌడ్, ఇర్ఫాన్, ఉషా, శుభం, మహేందర్, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

అభయహస్తం కాలనీలో దుప్పట్ల పంపిణీ

నగరంలోని అభయహస్తం కాలనీలో కాంగ్రెస్ నాయకులు మల్యాలగోవర్ధన్, కృష్ణ ఆధ్వర్యంలో నర్మదాబానా శివలింగం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కాలనీలోని నిరుపేదలకు దుప్పట్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గోవర్ధన్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రావడంలో రేవంత్‌రెడ్డి కీలకపాత్ర పోషించాడని పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు శివ, రాజారాం, సునీత పాల్గొన్నారు.

రైస్‌మిల్లర్ల దోపిడీని అరికట్టాలి

- ఏఐయూకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్

7

- హైకోర్టు తీర్పు నేపథ్యంలో ప్రభుత్వ వర్గాల సీరియస్
- ఒక్కరి చేతిలోనే అన్ని విభాగాల వ్యవహారాలు
- భారీగా చేతులు మారిన డబ్బు?
- నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న పెద్దసారు
- నల్లగొండ జిల్లాలోనూ వివాదాస్పదన నిర్ణయాలు



రిజిస్ట్రార్‌పై వేటుకు రంగం సిద్ధం



తెలంగాణ యూనివర్సిటీలో తాజాగా జరుగుతున్న పరిణామాలపై నిఘా వర్గాలు ఆరా తీస్తున్నాయి. 2012లో అక్రమ నియామకాలపై ఇటీవల హైకోర్టు తీర్పు నేపథ్యంలో అటుగా దృష్టిసారించాయి. ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్‌ల నియామకాలు చెల్లవని చెప్పడంతో సర్కారు సైతం నజర్ పెట్టింది. వర్సిటీ ప్రతిష్ట దెబ్బతింటుందనే ఆలోచనతో క్యాంపస్ వ్యవహారాలపై సీరియస్‌గా ఉంది. కాగా తీర్పు నేపథ్యంలో బాధ్యుడైన అధికారి ఇప్పుడు ఏకంగా అక్రమ నియామకాలను సమర్థించుకునే పనిలో ఉన్నట్లు సమాచారం.

నిజామాబాద్, నవంబరు8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): 2012లో అప్పటి వీసీ అక్బర్ అలీఖాన్, అప్పటి రిజిస్ట్రార్ లింబాద్రి అక్రమంగా 91మందిని నియమించేందుకు నోటిఫికేషన్ ఇచ్చారు. 53 మందిని నియమించగా ప్రస్తుతం 38మంది మాత్రమే వివిధ హోదాల్లో పనిచేస్తున్నారు. అక్రమ నియామకాలు అని తెలిసినా ప్రస్తుతం రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న ఓవ్యక్తి వాటిని సక్రమం చేసేందుకు ఏకంగా పదోన్నతులు కల్పించేందుకు ఫైల్ సిద్ధం చేయడంపై అనేక విమర్శలు వస్తున్నాయి. పదోన్నతుల క్లియరెన్స్ కోసం వర్సిటీ నిధులను దుర్వినియోగం చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

రిజిస్ట్రార్ చేతిలోనే అన్ని విభాగాలు

గతనెల 31న హైకోర్టు అక్రమ నియామకాలు చెల్లవని తీర్పు ఇవ్వగా వాటిపై సమాధానం చెప్పేందుకు రిజిస్ట్రార్ కానీ, వైస్ చాన్సలర్‌కాని అందుబాటులో లేరు. ఐదేళ్లుగా రిజిస్ట్రార్‌గా నిబంధనలకు విరుద్ధంగా సుదీర్ఘకాలంపాటు పనిచేస్తున్న వ్యక్తి అన్ని విభాగాలను తన గుప్పిట్లో పెట్టుకున్నాడనే ఆరోపణలు ఉన్నాయి. వర్సిటీకి వైస్ చాన్స్‌లర్ లేని సమయంలో ఉన్నత విద్యా కమిషనర్ ఇంచార్జ్‌గా ఉన్న సమయంలో పాలన అంతా సదరు రిజిస్ట్రార్ కనుసన్నల్లోనే జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి.

భారీగా చేతులు మారిన డబ్బు

అప్పటి ఉన్నత విద్యాశాఖ కమిషనర్‌గా పనిచేసి, ఇప్పుడు నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇచ్చే కమిషన్‌కు చైర్మన్‌గా నియమితులైన వ్యక్తి అక్రమ నియామకాలను సక్రమం చేసేందుకు భారీ మొత్తంలో డబ్బులు దండుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. రెగ్యులర్ వీసీగా రవీందర్‌గుప్త తర్వాత ఉన్నత విద్యాశాఖ కమిషనర్‌లు ఇన్‌చార్జి వీసీలుగా పనిచేసిన క్రమంలో వారు యూనివర్సిటీకి వచ్చిన దాఖలాలు కనిపించలేదు. అప్పుడు రిజిస్ట్రార్ ఒక్కడే యూనివర్సిటీని అన్ని తానై వ్యవహరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. అక్రమ నియామకాల కేసు కోర్టులో పెండింగ్‌లో ఉండగానే పదోన్నతుల విషయంలో ఎలాంటి అభ్యంతరంలేనట్లు ప్రభుత్వానికి సదరురిజిస్ట్రార్ అప్పటి ఉన్నత విద్యాకమిషనర్ చేత లేఖ రాయించగలిగారంటే ఈ వ్యవహారంలో ఎన్ని కోట్ల డీల్ జరిగిందో స్పష్టం చేస్తుంది.

నల్గొండలో ఉన్నప్పుడూ వివాదాస్పదమే..

ప్రస్తుతం తెలంగాణ యూనివర్సిటి రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న వ్యక్తి గత ఐదేళ్లకు పైగా నిబంధనలకు విరుద్ధంగా ఇక్కడ పనిచేస్తున్నాడు. రిజిస్ట్రార్ పదవికాలం యేడాదే ఉండగా వైస్ చాన్స్‌లర్‌లు మారిన రిజిస్ట్రార్ మాత్రం మారకపోవడం విస్మయానికి గురిచేస్తోంది. గతంలో నల్గొండ మహాత్మగాంధీ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న (మిగతా 8వ పేజీలో..)



• కమ్మేసిన పొగమంచు


తగ్గిన ఉష్ణోగ్రతలు

- ఒక్కసారిగా పెరిగిన చలి
- వర్నిలో 14.8 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు

నిజామాబాద్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టడంతో చలితీవ్రత పెరిగింది. గత రెండు మూడురోజులు 22 సెల్సియస్ డిగ్రీలపైనే ఉన్న ఉష్ణోగ్రత ఒక్కసారిగా 14 డిగ్రీలకు పడిపోయింది. దీంతో చలి తీవ్రత శుక్రవారం రాత్రి నుంచి విపరీతంగా పెరిగింది. శనివారం జిల్లాలోని వర్ని మండలం జాకోరాలో కనిష్ఠ ఉష్ణోగ్రత 14.8 డిగ్రీలుగా నమోదైంది. కోటగిరి, పోతంగల్, చందుర్‌లో 14.9 డిగ్రీలు నమోదైంది. మోస్రా, నిజామాబాద్, ఇందల్వాయి, సాలూ ర, మంచిప్పలలో 15 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఒక్కసారిగా రాత్రిపూట ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టడంతో ప్రజలు తీవ్రతతో ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో చలితీవ్రత ఎక్కువగా ఉంది. దీంతో రాత్రి సమయంలో ప్రజలు బయటకు రావడంలేదు. రాత్రి 8 దాటితే రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి.

నేడు ఆర్ఎస్ఎస్ శతాబ్ది పథ సంచలన్

నిజామాబాద్ కల్చరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ స్వయంసేవక్ శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని ఆదివారం నగర సంఘ్ ఆధ్వర్యంలో పథ సంచలన్ నిర్వహించనుంది. సాయంత్రం 4.30లకు ప్రారంభమయ్యే పథసంచలన్ ఉమెన్స్ కాలేజీ నుంచి ప్రారంభమై చంద్రశేఖర్ కాలనీ, (మిగతా 8వ పేజీలో..)







విద్యుత్ దీపాలతో ముస్తాబ్ చేసిన ఆలయం

కాలభైరవం భజే

నేటి నుంచి కాలభైరవ స్వామి జన్మదిన వేడుకలు

- భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతున్న కాలభైరవ స్వామి
- విద్యుత్ దీపాలతో ఆలయ అలంకరణ
- భక్తులకు కావాల్సిన ఏర్పాట్లు చేస్తున్న దేవదాయ శాఖ

దేవరాజ సేవ్యమాన పావనాంఘ్రి పంకజం..
వ్యాల యజ్ఞ సూత్రమిందు శేఖరం కృపాకరం..
నారదాది యోగివృంద వందితం దిగంబరం..
కాశీకాపురాధి నాథ కాలభైరవం భజే..!!

అనే కీర్తనలతో కాల భైరవుడు ఘనమైన పూజలు అందుకోనున్నాడు. కామారెడ్డి జిల్లాలోని రామారెడ్డి మండలం ఇస్సన్నపల్లి-రామారెడ్డి గ్రామాల మధ్య వెలసిన శ్రీకాల భైరవస్వామి జన్మదిన వేడుకలను నేటి నుంచి ఈ నెల 13వ తేది వరకు నిర్వహించడానికి దేవదా యశాఖ అన్నిఏర్పాట్లు పూర్తిచేసింది. రాష్ట్రంలోనే ప్రత్యేకగుర్తింపు పొందిన ఆలయంగా శ్రీకాలభైరవ స్వామి ఆలయం చరిత్రలో తనకంటు ఓ పేజిని లిఖించుకుంది.

రామారెడ్డి, నవంబరు8 (ఆంధ్రజ్యోతి): శ్రీ కాలభైరవస్వామి జన్మదిన వేడుకలకు జిల్లాతోపాటు కరీంనగర్, వరంగల్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, హైదరాబాద్, పక్క రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాల నుంచి భక్తులు తరలివస్తారు. ఉత్సవాలు కార్తీక మాసం, బహుళ పంచమి, ఆదివారం రోజున ప్రారంభిస్తారు.

ప్రత్యేకత కలిగిన మూల బావి..

ఆలయ ఆవరణలో ఈశాన్య దిశలో ఉన్న మూల బావి నీటితో భక్తులు స్నానాలు చేసి తడి పట్టలతో స్వామి వారిని దర్శించుకుంటారు. మూలబావి నీటిని బిందెలతో తీసుకొని వెళ్లి స్వామివారికి అభిషేకం చేస్తే ఆరోగ్యసమస్యలు, దీర్ఘకాళిక వ్యాధులు తొలగి, సంతానం లేనివారికి సంతానం కలుగుతుందని భక్తుల నమ్మకం, మూలబావి పక్కనే (మిగతా 8వ పేజీలో..)



టీకా ఉండగా.. భయమెందుకు దండగా

6

- పశువుల్లో వ్యాధుల నియంత్రణకు వ్యాక్సిన్లు
- జిల్లాలో 79శాతం వ్యాక్సినేషన్
- భారత్ పశుధన్ యాప్‌లో జీవాల వివరాలు

కొండెక్కిన కోడిగుడ్డు ధర

- కిలో చికెన్ రూ.200
- ఒక కోడిగుడ్డు ధర రూ.7

దిగొచ్చిన చికెన్ ధర



ఇందూర్, నవంబరు8 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. నూనెలు, పప్పులు, ఉప్పుల ధరలు సామాన్యులకు చుక్కలు చూపిస్తున్నాయి. కూరగాయల ధరలు కూడా బెంబేలెత్తిస్తున్నాయి. దీంతో ఏం కొనెట్టు లేదు.. ఏం తినేట్టు లేదని పేద, మధ్య తరగతి ప్రజలు నిట్టూరుస్తున్నారు. మూలికే నక్క మీద తాటిపండు పడ్డ చందంగా తాజాగా.. కోడి గుడ్డు ధరలు కూడా అమాంతం పెరిగాయి. రోజురోజుకు ధరలు పైపైకి ఎగబాకుతున్నాయి. హోల్ సేల్ మార్కెట్‌లో ఒక్కో కోడిగుడ్డు ధర రూ.6 ఉండగా... రిటైల్ మార్కెట్‌లో రూ. 7 వరకు పలుకుతోంది. బహిరంగ మార్కెట్‌లో కోడిగుడ్ల ధరలు క్రమంగా పెరుగుతున్నాయి. ఇదే సమయంలో చికెన్ ధరలు తగ్గుతూ వస్తున్నాయి. చలికాలంలో గుడ్ల వినియోగం పెరగడంతోపాటు ఉత్పత్తి తగ్గడంతో గుడ్డు ధర కొండెక్కగా ఎలాంటి (మిగతా 8వ పేజీలో..)

జైల్ అదాలత్‌లో 38 కేసుల పరిష్కారం

- జూనియర్ సివిల్ జడ్జి హరికుమార్

నిజామాబాద్‌లీగల్, నవంబరు8(ఆంధ్రజ్యోతి): జిల్లాన్యాయసేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో నిజామాబాద్ కేంద్రకారాగారంలో శనివారం నిర్వహించిన జైల్ అదాలత్‌లో 38 కేసులను పరిష్కరించారు. జైల్‌అదాలత్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నిజామాబాద్ జూనియర్ సివిల్ న్యాయాధికారి హరికుమార్ ఖైదీలను ఉద్దేశించి మాట్లాడారు. సామాజిక పరిస్థితులు మనుషుల మనసులను మార్చివేసి నేరానికి పురికొల్పుతాయని, వాటిని అధిగమించి సామాజినికి ఆదర్శంగా నిలవాలని ఉద్బోదించారు. జ్యూడీషియల్ రిమాండ్‌లో ఉన్న ఖైదీలు, న్యాయస్థానాల ద్వారా శిక్షకు గురైన ఖైదీలను ఉద్దేశించి ప్రసంగించి, రాజీపద్ధతిన 38 క్రిమినల్ కేసులను పరిష్కరించారు, తెలిసీ తెలియక చేసినా నేరం నేరమేనని (మిగతా 8వ పేజీలో..)



జైల్ అదాలత్‌లో పాల్గొన్న న్యాయాధికారి హరికుమార్

క్రైం సమాచారం

మంజీరా నదిలో యువకుడి గల్లంతు


నర్సింలు (ఫైల్)

బీర్కూర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దామరాంచ గ్రామ సమీపంలోని మంజీరా నదిలో గ్రామానికి చెందిన కర్రోల నర్సింలు(28) గల్లంతయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బీర్కూర్ మండలం దామరాంచ గ్రామానికి చెందిన నర్సింలు అనే యువకుడు మరో ముగ్గురితో కలిసి శుక్రవారం మధ్యాహ్నం మంజీరా నదిలో చేపల వేటకు వెళ్లి.. చేపల కోసం వల కట్టారు. అనంతరం ఇంటికి వెళ్లి సాయంత్రం వరకు వద్దామని తోటి స్నేహితులు నర్సింలుతో అన్నారు. మీరు వెళ్లండి.. నేను తరువాత వస్తానని నర్సింలు స్నేహితులతో అనడంతో వారు ముగ్గురు వెళ్లిపోయారు. రాత్రి అయినా నర్సింలు ఇంటికి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు అతడి ఆచూకీ కోసం గ్రామంలో గాలించారు. శనివారం ఉదయం కుటుంబ సభ్యులు, అతడి స్నేహితులు మంజీరా నదికి వెళ్లి చూడగా నర్సింలు కనిపించలేదు. అతడికి సంబంధించిన వస్త్రాలు, ఫోన్ మంజీరా నది ఒడ్డున కనిపించాయి. నర్సింలు నదిలో గల్లంతు అయ్యుంటాడని భావించిన కుటుంబ సభ్యులు, స్నేహితులు గ్రామ పెద్దలకు, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని నర్సింలు వస్త్రాలను, ఫోన్‌ను పరిశీలించారు. అనంతరం పోలీసులు గజఈతగాళ్లను రప్పించారు. నర్సింలు కోసం నదిలో గాలింపు చర్యలు ప్రారంభించారు.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం.. వైర్ చోరీ

ఇందల్వాయి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఇందల్వాయి శివారులోని బాలురెడ్డి, కిషన్ పొలం దగ్గర ట్రాన్స్‌ఫార్మర్‌ను గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పగలగొట్టి అందులోని ఆయిల్, కాపర్‌వైర్‌ను దొంగలించినట్లు ఎస్‌ఐ సందీప్ శనివారం తెలిపారు. విద్యుత్ ఏఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత.. కేసు నమోదు

బోధన్,నవంబరు8(ఆంధ్రజ్యోతి): 10 టన్నుల పీడీఎస్ బియ్యం పట్టివేతపై శనివారం కేసు నమోదు చేసినట్లు బోధన్ రూరల్ ఎస్‌ఐ మచ్చేందర్ రెడ్డి తెలిపారు. ఈ నెల 4న అమ్దాపూర్ గ్రామ శివారులో అక్రమంగా పీడీఎస్ బియ్యం తరలిస్తున్నారన్న పక్కా సమాచారం మేరకు సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్‌తో పాటు పోలీసులు తనిఖీలు నిర్వహించారు. నిజామాబాద్‌కు చెందిన షేక్ సోఫియన్ ఆటోలో బియ్యం తరలిస్తుండగా గుర్తించి పట్టుకున్నారు. విచారణ అనంతరం శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

ఇసుక తరలిస్తున్న రెండు ఆటోలపై..

బోధన్,నవంబరు8(ఆంధ్రజ్యోతి): మంజీర నది నుంచి బోధన్ ప్రాంతానికి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ఆటోలను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు బోధన్ రూరల్ ఎస్‌ఐ మచ్చేందర్ రెడ్డి తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ సత్యనారాయణ గౌడ్

లక్కీడ్రాలు నిర్వహిస్తే కఠిన చర్యలు

భీమ్‌గల్ , నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): భీమ్‌గల్ పరిసర ప్రాంతాలలో లక్కీ డ్రాల పేరిట ప్రజలను మోసం చేస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ సత్యనారాయణగౌడ్ తెలిపారు. శనివారం భీమ్‌గల్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ మాట్లాడారు. మండలంలో ప్లాట్లు, వ్యవసాయభూములను లక్కీ డ్రాల ద్వారా విక్రయిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇలాంటి వారిని ప్రజలు నమ్మవద్దని సూచించారు. ఇలాంటి వారు ప్రజల నుంచి డబ్బులు వసూలు చేసి, దూర ప్రాంతాలకు వెళ్లి, ఐపీ పెట్టి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తారని, ఎవరైనా ఇలాంటి వాటిలో డబ్బులు పెడితే తిరిగి తీసుకోవాలని తెలిపారు. ఇలాంటి ఘటనలు ఎక్కడైనా జరిగితే తమ దృష్టికి తేవాలన్నారు. ఈ సమావేశంలో ఎస్‌ఐ సందీప్ ఉన్నారు.


ఎన్‌టీఆర్ చౌరస్తాలో గుంతను పూడ్చివేస్తున్న ఎస్‌ఐ సునీల్

ఎస్‌ఐ చొరవతో రోడ్డు మరమ్మతులు

కోటగిరి,నవంబరు8(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మండలంలో ప్రధాన రహదారులపై భారీ గుంతలు ఏర్పడి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబంధిత ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో గుంతల్లో పడి ప్రమాదాలు జరుగుతున్నాయి. కోటగిరి, పోతంగల్ ప్రధాన రహదారిపై పలువురు తీవ్ర గాయాలపాలైన సంఘటనలు నెలకొన్నాయి. ఈ సమస్యపై కోటగిరి ఎస్‌ఐ సునీల్ స్పందించారు. టిప్పర్‌లలో కంకర మిక్సింగ్‌తో కూడిన డస్ట్ తెప్పించారు. ఆయా ప్రాంతాలలో ఏర్పడిన గుంతలను పూడ్చి బ్లేడ్ ట్రాక్టర్‌ను చదును చేయించారు. ఎస్‌ఐ సునీల్ గుంతలను పూడ్చివేయించడం పట్ల వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు. సమస్యను పరిష్కరించిన పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.


మాట్లాడుతున్న సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా నేత దేవరాం

అమరుల ఆశయాలు కొనసాగించాలి

ఆర్మూర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): భూమి, భుక్తి కోసం పేదల తరపున పోరాడి ప్రాణాలు వదిలిన అమరుల ఆశయాలను కొనసాగించాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా డివిజన్ కార్యదర్శి దేవరాం, సబ్ డివిజన్ కార్యదర్శి కిషన్ అన్నారు. మండలంలోని అంకాపూర్‌లో అమరవీరుల చిత్రపటాలకు శనివారం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తెలంగాణ సాయుధ పోరాటంలో రైతులు, కార్మికుల హక్కులు, పేదల కోసం అనేక మంది త్యాగాలు చేశారన్నారు. రాయల రవి, దుర్గంపుడి వెంకటకృష్ణ, చంద్రశేఖర్ లాంటి వారెందరో త్యాగాలు చేశారని, వారిచ్చిన స్ఫూర్తితో హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. అదే విధంగా డబుల్ బెడ్ రూం ఇళ్ల కోసం పోరాటం కొనసాగించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు నిమ్మల నిఖిల్, లింబాద్రి, పోశెట్టి, రఫిక్, బోజమ్మ తదితరులు పాల్గొన్నారు.

టీకా ఉండగా.. భయమెందుకు దండగా

▶▶ పశువుల్లో వ్యాధుల నియంత్రణకు వ్యాక్సిన్లు ▶▶ జిల్లాలో 79 శాతం ఎఫ్ఎండీ వ్యాక్సినేషన్ ▶▶ భారత్ పశుధన్ యాప్‌లో జీవాల వివరాలు


పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేస్తున్న దృశ్యం(ఫైల్)

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు పాడి ఆవులు, గేదెల రక్షణతో పాటు ఇతర పశువుల్లో వ్యాధుల నివారణకు పశుసంవర్ధక శాఖ దృష్టి సారించింది. ప్రధానంగా పశువుల్లో కాళ్ల వాపు వ్యాధి, గాలికుంటు(ఎఫ్ఎండీ (ఫుడ్ అండ్ మౌత్ డిసిజెస్)) రాకుండా ప్రతి 6నెలలకోసారి టీకాలు వేస్తున్నారు. వీటితో పశువుల్లో వ్యాధి నిరోధక శక్తి పెరిగి ఆరోగ్యంగా ఉంటాయి. గత నెల 15న ప్రారంభమైన టీకాల కార్యక్రమం ఈ నెల 15వ తేదీతో ముగియనుంది. ఎఫ్ఎండీ వ్యాధులతో పాటు ఇతర వైరస్‌లను కూడా నియంత్రించేందుకు ఎఫ్ఎండీ, ఇతర టీకాలు వేస్తున్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తున్నారు.
- బోధన్

జిల్లాలో ఇలా..

జిల్లావ్యాప్తంగా 1,94,368 గేదెలు, ఆవులు ఉన్నాయి. పాడి ఉత్పత్తులను పెంచడంతో పాటు వాటిని కాపాడేందుకు వైరస్ వ్యాప్తిని నియంత్రించేందుకు ప్రభుత్వం టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇప్పటి వరకు జిల్లాలో 79శాతం వరకు వ్యాక్సినేషన్ పూర్తయింది. ఏటా రెండుసార్లు టీకాలు వేయడం వల్ల వైరస్ వ్యాప్తి తగ్గుముఖం పట్టి పశువులకు రక్షణ కలుగుతుంది. పశుసంపద తగ్గితే పాల ఉత్పత్తులపై పడే అవకాశం ఉన్నందున ప్రతి గ్రామానికి అధికారులు వెళ్లి టీకాలు వేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 48 బృందాలు ఏర్పాటు చేయగా.. ఒక్కో బృందంలో డాక్టర్‌తో పాటు ఫార్మాసిస్టు, గోపాలమిత్ర, పశు మిత్రలు ఉంటారు. వారి వివిధ గ్రామాలకి వెళ్లి టీకాలు వేస్తారు.

భారత్ పశుధన్ యాప్‌లో వివరాలు

పశు సంపద వివరాలను భారత్ పశుధన్ యాప్‌లో అధికారులు నమోదు చేస్తున్నారు. యాజమాని ఇతర వివరాలు ఉండటంతో పశువులకు టీకా ఇచ్చిన వెంటనే రైతు ఫోన్ నెంబర్‌కు ఓటీపీ వెళ్తుంది. దాని ఆధారంగా ఆధారంగా వివరాలు నమోదు చేస్తారు. ఈ ప్రక్రియ వల్ల ఎన్ని పశువులకు టీకాలు పూర్తయ్యాయో తెలుస్తుంది. అదే విధంగా ప్రతి పశువుకు ట్యాగ్ వేస్తారు. ఒక వేళ ట్యాగ్ ఊడిన, తిరిగి టీకాలు వేసే సమయంలో ట్యాగ్‌ను వేసి రికార్డులో నమోదు చేస్తారు.

ప్రతి పశువుకు టీకా వేయించాలి



ప్రతి రైతు గాలికుంటు వ్యాధి నివారణకు పశువులకు టీకాలు వేయించాలి. జిల్లాలో 79శాతానికి పైగా టీకాల కార్యక్రమం పూర్తయింది. ఈ నెల 14వరకు ఎఫ్ఎండీ వ్యాక్సినేషన్ వందశాతం పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. ప్రతి పశువుకు సంబంధించిన యాజమాని వివరాలతో పాటు ఆ పశువుకు సంబంధించిన వివరాలన్ని యాప్‌లో నమోదు చేస్తున్నాం. టీకాల కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి.
- రోహిత్‌రెడ్డి, జిల్లా పశుసంవర్ధక శాఖ, ఇన్‌చార్జి అధికారి

ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలి

డిప్యూటీ డీఎంహెచ్‌వో డా.సమత

బోధన్,నవంబరు8(ఆంధ్రజ్యోతి): ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ సమత అన్నారు. శనివారం పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రుల ల్యాబ్‌లను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. బీఎండబ్ల్యూ రిజిస్ట్రేషన్, పొల్యూషన్ సర్టిఫికెట్ తప్పకుండా ఉండాలని పేర్కొన్నారు. ల్యాబ్‌లను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఆమె వెంట మెడికల్ సిబ్బంది నిర్మల, రవి, తదితరులు ఉన్నారు.

శవపేటిక అందజేత

రుద్రూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిక్కడ్‌పల్లి గ్రామ కమిటీకి శనివారం లయన్స్ క్లబ్ ఆఫ్ రుద్రూర్ సీనియర్ సభ్యుడు, జిల్లా చైర్మన్ లయన్ శ్యాంసుందర్ పహాడే సహకారంతో శీతల శవపేటికను అందించారు. చనిపోయిన మృతదేహం చెడిపోకుండా ఉండడానికి వాడే శీతల శవపేటిక(డెడ్ బాడీ ఫ్రీజర్)ను అందజేశారు. గ్రామస్థులు దాతను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి ప్రశాంత్ గౌడ్, సభ్యులు రమేష్, డాక్టర్ మల్లేష్, పార్వతి ప్రశాంత్, వీడీసీ అధ్యక్షుడు కుర్మరాజు, రాజయ్య, అశోక్, మక్కయ్య, అశోక్, పెద్ద హన్మంతు, రమేష్, మోహన్, పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకుడు పోచీరాం

చలో ఢిల్లీకి తరలిరావాలి

కోటగిరి,నవంబరు8(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గావాయ్‌పై దాడి చేసిన నిందితులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి పోచీరాం డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం ఎమ్మార్పీఎస్ నాయకులు విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ నెల 17వ తేదీన ఢిల్లీలోని జంతర్‌మంతర్‌లో తలపెట్టిన దళితుల ఆత్మ గౌరవ ప్రదర్శనకు ప్రతీఒక్కరు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్, శ్రీనివాస్, లాలయ్య, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

నేడు కమ్మ సంఘం ఆధ్వర్యంలో వనభోజన ఆత్మీయ సమ్మేళనం

బోధన్,నవంబరు8(ఆంధ్రజ్యోతి): బోధన్ కమ్మసంఘం ఆధ్వర్యంలో ఆదివారం సంఘం భవనంలో కార్తీక వన భోజన ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు సంఘం ప్రతినిధి శివన్నారాయణ తెలిపారు. ఉదయం మేధా సరస్వతి పూజ, ఉసిరి చెట్టుపూజ, లలిత సహస్ర నామ పఠనంతో కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. రాకాసిపేట్ మహిళా బృందంతో కోలాటం ప్రదర్శన ఉంటుందన్నారు. కార్యక్రమం ఉదయం 8గంటలకు ప్రారంభమవుతుందని, కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీమంత్రి మండవ వెంకటేశ్వర్ రావు, సామాజిక సాంస్కృతిక ఉపన్యాసకురాలు భారతీయం సత్యవాణి తదితరులు పాల్గొననున్నారని తెలిపారు. సంఘం సభ్యులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.


ప్రచారంలో పాల్గొన్న ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డి

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి

▶▶ ప్రభుత్వ సలహాదారు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

బోధన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి):జూబ్లీహిల్స్ నియోజకవర్గం అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని ప్రభుత్వ సలహాదారు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని ఎర్రగడ్డ డివిజన్, ఏబీ కాలనీ, రాజు నగర్, కళ్యాణ్ నగర్ తదితర ప్రాంతాలలో ఆయన ప్రచారం నిర్వహించారు. 10 సంవత్సరాల పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి ఏమి లేదని ఎద్దేవా చేశారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి నియోజకవర్గ అభ్యర్థిగా నిలబడిన నవీన్ యాదవ్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని ఈ సందర్భంగా ఆయన ఓటర్లను కోరారు. డివిజన్‌లోని ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఆయన వెంట పలువురు కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం


విజేతలకు బహుమతులు అందజేస్తున్న సీఐ సత్యనారాయణ గౌడ్

ఆర్మూర్ , నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో పాల్గొనాలని, క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని ఆర్మూర్ సీఐ సత్యనారాయణ గౌడ్, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల జిల్లా సమన్వయ అధికారి మాధవీలత అన్నారు. శనివారం ఆర్మూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో నిర్వహించిన గురుకుల విద్యాలయాల రెండవ జోన్ బాలుర జోనల్ స్థాయి క్రీడా పోటీల ముగింపు సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు చదువులో లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని వాటి సాధనకు కృషి చేయాలన్నారు. క్రీడా పోటీల్లో బాసర జోన్ పరిధిలోని 12 పాఠశాలలు, కళాశాలలకు చెందిన సుమారు 1000 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వాలీబాల్, ఫుట్‌బాల్, కబ్బడీ, బాల్ బ్యాట్మింటన్, ఖోఖో, టెన్నికాయిట్, అథ్లెటిక్ క్రీడాంశాలలో పోటీలు నిర్వహించారు. విజేతలకు ముఖ్య అతిథులు మెడల్స్ ట్రోఫీ, బహుమతులు అందజేశారు.


గెలుపొందిన జట్లకు బహుమతులు టస్తున్న బీసీ గురుకులాల ఏజీవో వెంకటేశ్వర్ రెడి

గెలుపు ఓటములు సహజం

జక్రాన్‌పల్లి , నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని, ఓడిన జట్లు భవిష్యత్తులో జరిగే క్రీడల్లో పాల్గొని విజయం కోసం పోటీపడాలని బీసీ గురుకులాల ఏజీవో వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని మునిపల్లిలో మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల బాలికల జూనియర్, మహిళా డిగ్రీ కళాశాలలో అండర్ -17 విభాగంలో నిర్వహించిన వివిధ క్రీడా పోటీలు శనివారం ముగిశాయి. ఈ క్రీడల ముగింపు కార్యక్రమానికి బీసీ గురుకులాల ఏజీవో వెంకటేశ్వర్ రెడ్డి హాజరై మాట్లాడారు. విద్యార్థినులు వివిధ క్రీడల్లో ప్రతిభను కనబర్చి క్రీడా స్ఫూర్తిని చాటాలన్నారు. కబడ్డీ విభాగంలో నిజామాబాద్ అర్బన్ విద్యార్థులు ప్రథమ బహుమతిని గెలుచుకోగా సాలూర విద్యార్థులు రెండో స్థానంలో నిలిచారు. ఖోఖో విభాగంలో నిజామాబాద్ అర్బన్ పాఠశాల విద్యార్థులు ప్రథమ.. బాల్కొండ విద్యార్థులు ద్వితీయ బహుమతులను గెలుచుకున్నారు. వాలీబాల్ విభాగంలో నిజామాబాద్ అర్బన్ ప్రథమ, వర్ని విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచారు. టెన్నికైట్, చదరంగం, అథ్లెటిక్స్ క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు బీసీ గురుకులాల ఏజీవో వెంకటేశ్వర్‌రెడ్డి, ఆర్సీవో సత్యనాథ్‌రెడ్డి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పరచూరి అనసూయ, ఏపీపీ సుష్మ, పీఈటీలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలు


ఆర్మూర్‌లో జంబి హనుమాన్ ఆలయ ఆవరణలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న స్వయం సేవకులు

ఆర్మూర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని శనివారం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆర్మూర్ పట్టణంలో ఘనంగా ఆర్‌ఎస్‌ఎస్ పథసంచాలన్ నిర్వహించారు. పెర్కిట్ నుంచి స్వయం సేవక్‌ల ఒక బృందం, పట్టణంలోని నల్ల పోచ్చమ్మ కమాన్ నుంచి స్వయం సేవకులు పథసంచాలన్ పట్టణంలోని ప్రధాన వీధుల గుండా జంబి హనుమాన్ మైదానానికి చేరుకున్నాయి. ఆర్‌ఎస్‌ఎస్ పథ సంచాలన్ స్వయం సేవకులకు దారిపొడుగున ప్రజలు, మహిళలు పువ్వులు చల్లుతూ స్వాగతించారు. అనంతరం ఇందూర్ విభాగ్ కార్యవహా దిగంబర్ జీ మాట్లాడుతూ.. దేశ రక్షణలో ఆర్‌ఎస్‌ఎస్ తమ వంతు కృషి చేస్తుందన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ స్థాపించి 100 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కార్యక్రమాలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ నగర కార్యవహా పోల్కం నారాయణ, జాతీయ పసుపుబోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, స్వయం సేవక్‌లు పాల్గొన్నారు.

భీమ్‌గల్: రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ శతాబ్ది సందర్భంగా భీమ్‌గల్ ఖండ ఆధ్వర్యంలో పట్టణ కేంద్రంలోని ర్యాలీ నిర్వహించారు. సంఘం 100 సంవత్సరాల మౌన తపస్సు కారణంగా సర్వవ్యాప్తి సర్వస్పర్శి అయిన సంఘం భారతీయ సంస్కృతి విలువలను ప్రపంచానికి తెలియచేస్తూ హిందూ సంఘటనం, జన జాగరణ కోసం ముందుకు వెళ్తోందని రాష్ట్ర విభాగ్ సహకార్యవాహ వరంగంటి శ్రీనివాస్ తెలిపారు. ర్యాలీలో జిల్లా సహ బౌద్ధిక్ ప్రముఖ్ యెన్ను శ్రీధర్, ఖండ కార్యావహ మంచే గణేష్ తదితరులు పాల్గొన్నారు.


భీమ్‌గల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న స్వయం సేవకులు

ఘనంగా పల్లకి సేవ


తొర్లికొండ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

జక్రాన్‌పల్లి , నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తొర్లికొండలోని శనివారం శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం ఉత్సవాలను భక్తులు, గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో ఉత్సవాల్లో పాల్గొని స్వామివారి పల్లకిని కొండపై చుట్టూ ఊరేగించారు. అనంతరం ఆలయంలో భక్తులు, ప్రజలు, గ్రామస్థులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం వద్ద భక్తుల కోసం అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సంజీవ్ గౌడ్, బ్రాహ్మన్‌పల్లి సొసైటీ చైర్మన్ కాటిపల్లి నర్సారెడ్డి పాల్గొన్నారు.

మహంతంలో విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు..

నవీపేట,నవంబరు8(ఆంధ్రజ్యోతి): మండలంలోని మహంతంలో శనివారం యంత్ర, విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలో ఇటీవల మాజీ ఉప సర్పంచ్ పల్లికొండ పోశెట్టి తన సొంత ఖర్చుతో పెద్ద పోచమ్మ, భూలక్ష్మమ్మ ఆలయాలను నిర్మించగా వీడీసీ ఆధ్వర్యంలో ఐదు చేతుల పోచమ్మ, మారెడమ్మ, నల్ల పోచమ్మ ఆలయాలను నిర్మించారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాల్లో ఉత్సవాలలో భాగంగా చివరి రోజైన శనివారం గణపతిపూజ, యంత్ర, విగ్రహ ప్రతిష్ఠాపన, బలి, ప్రాణప్రతిష్ఠ, బలిప్రదానం, మహా పూర్ణాహుతి, కుంభప్రోక్షణ, దేవత దివ్యదర్శనం, హారతి, మంత్ర పుష్పం, ప్రసాద వితరణ కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా మల్లారం ఆశ్రమ వ్యవస్థాపకులు పిట్ల కృష్ణ మహరాజ్ భక్తులను ఉద్దేశించి ప్రవచనలు చేశారు. అనంతరం అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.


భక్తులకు ప్రవచనాలు చేస్తున్న మల్లారం ఆశ్రమ వ్యవస్థాపకుడు పిట్ల కృష్ణ మహరాజ్

యంత్రం.. మొక్కజొన్న రైతుల నేస్తం


డబుల్ వీల్ మార్కర్ యంత్రాన్ని వినియోగిస్తున్న దృశ్యం

బోధన్,నవంబరు8(ఆంధ్రజ్యోతి): వరి మాగాణితో నేరుగా మొక్కజొన్న సాగు చేసే రైతులకు వరుసల మధ్య విత్తనాల మధ్య సమాన దూరంలో విత్తుకోవడానికి డబుల్ వీల్ మార్కర్ యంత్రం చాలా ఉపయోగకరంగా ఉంటుందని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ బోధన్ ఏరియా మేనేజర్ బి.అరుణ్ అన్నారు. శనివారం బోధన్ మండలంలోని పెంటాఖుర్దు గ్రామంలో సంస్థ ఆధ్వర్యంలో పునరుత్పాదక వ్యవసాయ విధానాలను రైతులకు అందించే కార్యక్రమంలో భాగంగా వరి కోతల అనంతరం నేరుగా మొక్కజొన్న సాగు చేసేందుకు అనువైన డబుల్ వీల్ మార్కర్ యంత్రాలను పరిసరా మండలాల గ్రామాలలోని రైతులకు అందజేశారు. దున్నకుండా మొక్కజొన్న సాగు చేపట్టడం వల్ల అదనపు సాగు ఖర్చులు సుమారు రెండు, మూడు నీటి తడులు ఆదా చేయవచ్చని అరుణ్, ఫణీంద్ర, ప్రవీణ్‌లు తెలిపారు. రైతులు పరస్పర సహకారంతో సక్రమంగా వినియోగించుకుంటూ మొక్కజొన్న సాగు విస్తీర్ణం పెంచాలని కోరారు.

జూబ్లీహిల్స్ ప్రచారంలో జక్రాన్‌పల్లి నేతలు


ప్రచారం చేస్తున్న మండల కాంగ్రెస్ నాయకులు

జక్రాన్‌పల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు కోసం జక్రాన్‌పల్లి మండల కాంగ్రెస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. శనివారం నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి ఆదేశాల మేరకు జూబ్లీహిల్స్‌లో యూత్ కాంగ్రెస్ నిజామాబాద్ రూరల్ ఉపాధ్యక్షుడు వినోద్, పుప్పాలపల్లి మాజీ ఎంపీటీసీ రమణారెడ్డి, కార్యకర్తలు కలిసి ప్రచారం చేపట్టారు. కాంగ్రెస్ అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మహేష్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

సీఎం సోదరుడి కుమార్తె వివాహ వేడుకలో పోచారం


వివాహ వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వ సలహాదారు పోచారం

బాన్సువాడటౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు ఎనుముల తిరుపతిరెడ్డి- మంజుల కుమార్తె వివాహ వేడుకల్లో ప్రభుత్వ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. వేడుకల్లో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్‌రెడ్డి, షబ్బీర్‌అలీ, సినీ నటుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, ఎమ్మెల్యే దానం నాగేందర్ తదితరులున్నారు.

అయ్యప్ప ఆలయంలో భక్తుల పూజలు


భక్తులకు అన్నప్రసాద వితరణ చేస్తున్న దృశ్యం

బాన్సువాడటౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అయ్యప్ప ఆలయంలో శనివారం ఉదయం అయ్యప్ప స్వామికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామికి నవవిధ అభిషేకాలు జరిపించారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భక్తుడు గులెపల్లి గంగాధర్ అయ్యప్ప స్వాములకు, భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులున్నారు.

బాన్సువాడ నుంచి బెంగళూరుకు బస్సు

బాన్సువాడటౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): బోధన్ డిపోకు చెందిన సూపర్ లగ్జరీ బస్సు బాన్సువాడ మీదుగా బెంగళూరుకు వెళ్లనున్నట్లు డీఎం రవికుమార్ తెలిపారు. ఈ బస్సు సర్వీసు బోధన్ నుంచి ప్రారంభమై బాన్సువాడకు మధ్యాహ్నం 1:10 గంటలకు చేరుకుంటుందని, మళ్లీ 1:30 గంటలకు బయలుదేరుతుందన్నారు. మెదక్, జేబీఎస్, ఎంజీబీఎస్, జడ్చర్ల, కర్నూలు, అనంతపూర్, బాగేపల్లి మీదుగా బెంగళూరుకు మరుసటి రోజు ఉదయం 5:45 గంటలకు చేరుకుంటుందని తెలిపారు. తిరిగి సాయంత్రం 4:30 గంటలకు బెంగళూరు నుంచి ప్రారంభమై తర్వాతి రోజున ఉదయం 8:05 గంటలకు బాన్సువాడకు చేరుకుంటుందని, ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అంజన్న ఆలయంలో ప్రత్యేక పూజలు


సలాబత్ పూర్ ఆలయంలో ప్రత్యేక పూజలు

మద్నూర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సలాబత్పూర్ ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం పురస్కరించుకొని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా ఆలయంలో సత్యనారాయణ వ్రతాలను చేసుకున్నారు. ఈ ఆలయానికి మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి భక్తులు ప్రతి శనివారం వేలాదిగా తరలివచ్చి పూజలు నిర్వహిస్తారు. కార్తీక మాసం సందర్భంగా ఆలయంలో సత్యనారాయణ వ్రతాలను నిర్వహించారు. ఆలయ అర్చకులు విజయ్ భక్తులకు సత్యనారాయణ కథ వినిపించి ప్రతి ఒక్కరూ భక్తి మార్గంలో నడవాలని సూచించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ


నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

ఇందల్వాయి, నవంబర్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ పలు కుటుంబాలను పరామర్శించారు. లోలం గ్రామంలో నరేష్ మాతృ వియోగం, ఎల్లారెడ్డి పల్లి గ్రామంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పులి శ్రీనివాస్ మామ ఇటీవలే మరణించారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ బాధిత కుటుంబాల ఇంటికి వెళ్లి పరామర్శించారు. కుటుంబానికి అండగా ఉంటానని, అధైర్య పడవద్దని భరోసా కల్పించారు. మృతుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు చిలివేరి దాసు, మాజీ ఎంపీపీ రమేష్ నాయక్, సీనియర్ నేతలు పాశంకుమార్, గద్యేల్ శ్రీనివాస్, మోహన్ నాయక్, రఘు, రాము, సుధీర్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు

న్యాయ సహాయం
సామాన్యుడికి భరోసా





దేశ పౌరుడికి న్యాయం అందించడం రాజ్యాంగ హక్కు అయితే సామాన్యుడికి సైతం సమన్యాయం అందించడం న్యాయసేవా సంస్థ ధ్యేయం. చాలామంది పేద ప్రజలు న్యాయ వ్యవస్థ అంటే ఖర్చు, భయం అని భావిస్తారు. ఆ భయాన్ని తొలగించి, అందరికీ న్యాయం చేరేలా చేయడమే లీగల్ సర్వీసెస్ అథారిటీ ప్రధాన లక్ష్యం. ఈ దిశగా నిజామాబాద్ జిల్లా లీగల్ సర్వీసెస్ సమితి నిర్వహించిన లీగల్ సర్వీసెస్ వేడుకలు ప్రజల్లో విశ్వాసాన్ని నింపాయి. ప్రధానంగా విలేజ్ డెవలప్‌మెంట్ కమిటీల(వీడీసీ) బారి నుంచి ప్రభుత్వ ఆస్తులను కాపాడిన ఘనత మన జిల్లా న్యాయసేవా సంస్థకే దక్కింది. అందరికీ సమాన న్యాయ హక్కు అనే నినాదంతో సామాన్యుడికి న్యాయం చేకూర్చే ప్రయత్నం కొనసాగుతోంది.

▸▸ సమన్యాయం అందించడమే న్యాయసేవా సంస్థ ధ్యేయం

నేడు జాతీయ న్యాయసేవా సంస్థ దినోత్సవం


ప్రమాదబీమా కేసులో నష్ట పరిహారం అందిస్తున్న దృశ్యం

నిజామాబాద్ లీగల్, నవంబర్ 8: (ఆంధ్రజ్యోతి): ప్రతి మండలకేంద్రంలో న్యాయ అవగాహన శిబిరాలు నిర్వహించడం జిల్లాలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. న్యాయవాదులు, లీగల్ వలంటీర్లు, రెవెన్యూ అధికారులు, పోలీసు ప్రతినిధులు కలిసి ప్రజలకు చట్టసంబంధ అవగాహన కల్పించారు. భూతగాదాలు, కుటుంబ విభేదాలు, వృద్ధాప్య హక్కులు వంటి అంశాలపై ఉచిత న్యాయ సలహాలు అందిస్తున్నారు. గ్రామ సచివాలయ స్థాయిలో డిఫెన్స్ లీగల్ ఎయిడ్‌లను ప్రతి జిల్లాలో ఏర్పాటుచేశారు. కోర్టు మెట్లు ఎక్కకుండా తగాదాలను గ్రామాల్లో పరిష్కరించి న్యాయం ప్రజల వద్దకే చేరడం విశేషం.

ఉచిత న్యాయసాయం

న్యాయం ధనవంతులకే సొంతం అనే అపోహను చెదరగొట్టేలా సమితి పటిష్టమైన చర్యలు చేపట్టింది. ఆర్థికంగా సంవత్సర ఆదాయం రూ.3 లక్షల కంటే తక్కువ ఉన్న బలహీన వర్గాలకు, మహిళలకు ఉచిత న్యాయ సహాయం అందించడం ప్రధాన లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ఏడాదిలో వేలమంది లాభపడ్డారు. ప్రమాద బీమా కేసులు, ఆస్తి వివాదాలు, పింఛన్, కుటుంబ కేసులు వంటి అంశాల్లో ఉచిత న్యాయ సలహాలు అందించబడ్డాయి.

లోక్‌అదాలత్‌లలో పరిష్కారం వేగం

సాధారణ కోర్టు కేసులు ఏళ్ల తరబడి కొనసాగుతుంటే, లోక్‌అదాలత్‌ల ద్వారా తక్షణ పరిష్కారం లభిస్తోంది. తాజాగా జరిగిన లోక్ అదాలత్‌లో 30 వేలకు పైగా కేసులు పరిష్కరించబడ్డాయి. మధ్యవర్తిత్వం(26) పద్ధతి ద్వారా ప్రజలు అవగాహనతో పరిష్కార మార్గాన్ని ఎంచుకోవడం న్యాయ వ్యవస్థపై విశ్వాసాన్ని పెంచుతోంది.

న్యాయం భయం కాదు- భరోసా

న్యాయం అందరికీ చేరాలి ఇదే లీగల్ సర్వీసెస్ డే అసలు సందేశం. చట్టం భయం కాదు, భరోసా అనే ఆత్మవిశ్వాసం ప్రజల్లో పెంచడమే ఈ కార్యక్రమాల లక్ష్యం. నిజామాబాద్ జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కృషి వల్ల చైతన్యం, నమ్మకం పెరిగిందని ఇప్పుడు ప్రజలు విశ్వాసంగా చెబుతున్నారు. దీనికి మంచి ఉదాహరణ వీడీసీల అక్రమాలను సంస్థ సుమోటాగా పరిశీలించడం.

చట్టాలపై అవగాహన

భవిష్యత్తు పౌరుల్లో చట్టంపట్ల గౌరవం పెంపొందించడమే లక్ష్యంగా న్యాయఅవగాహన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. జిల్లా న్యాయమూర్తి ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం క్విజ్‌లు, వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

డిజిటల్ యుగంలో న్యాయం

ఇ- కోర్టు వ్యవస్థ ప్రారంభమవడంతో జిల్లాలో న్యాయం మరింత సులభం అవుతోంది. పిటిషన్లు ఆన్లైన్‌లో దాఖలు చేసుకునే అవకాశం, కేసు స్థితిని కక్షిదారులు మొబైల్ ద్వారా తెలుసుకునే సౌకర్యం ప్రజలకు చేరువవుతోంది.

ఖైదీలకూ న్యాయ మార్గదర్శకత్వం

సామాన్యులతో పాటు ఖైదీల హక్కుల రక్షణ పట్ల కూడా సమితి ప్రత్యేక దృష్టి పెట్టింది. నిజామాబాద్ సబ్‌జైలులో డిఫెన్స్ లీగల్ ఎయిడ్ సర్వీసెస్ బృందం పర్యటించి, ఖైదీల సమస్యలను విని, న్యాయ సలహాలు అందించింది. రిమాండ్ ఖైదీలకు కేసుల పురోగతిపై సమాచారం ఇవ్వడం, అవసరమైన న్యాయ సాయం కల్పించడం ద్వారా వారి హక్కులు కాపాడబడుతున్నాయి. ఖైదీల్లో చట్టం పట్ల గౌరవభావం పెంపొందించేందుకు న్యాయవాదులు సూచనలు చేశారు.


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

రైస్‌మిల్లర్ల దోపిడీని అరికట్టాలి

▸▸ ఏఐయూకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్

ఆర్మూర్‌టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించే సన్న, దొడ్డు వరి ధాన్యానికి బోనస్ చెల్లించాలని, తరుగు పేరుతో రైస్‌మిల్లర్ల దోపిడీని అరికట్టాలని అఖిల భారత ఐక్యరైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.ప్రభాకర్ డిమాండ్ చేశారు. శనివారం ఆర్మూర్ పట్టణంలోని కుమార్ నారాయణ భవన్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వానాకాలం సీజన్‌లో వర్షాలుపడి రైతులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. ప్రభుత్వం ఎకరానికి రూ.10వేలు ఇస్తానని చేతులు దులుపుకోవడం సమజసం కాదన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐయూకేఎస్ రాష్ట్ర కార్యదర్శి బి.దేవారం, ఎస్.సురేష్, బి.బాబన్న, రాజన్న, దామోదర్, కిషన్, లింబాద్రి, రమేష్, పోషన్న, కిషోర్, సాయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయాభివృద్ధికి రూ.3.21లక్షల విరాళం


దాతలను సన్మానిస్తున్న దృశ్యం

మాచారెడ్డి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చుక్కాపూర్ లక్ష్మీ నర్సింహస్వామి ఆలయ అభివృద్ధికి నిజామాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన గోల్కొండ మణిక్యప్పారెడ్డి రూ.3.21 లక్షలు శనివారం ఆలయ అర్చకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వామివారిని దర్శించు కుని కోరిన కోర్కెలు నెరవేరడంతో విరాళం అందజేయడం జరిగిందన్నారు. ఈ మేరకు దాత కుటుంబీకులను సన్మానించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

సైబర్ నేరాలపై అవగాహన


విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై రామకృష్ణ

సిరికొండ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సిరికొండ ఎస్సై జాడీ రామకృష్ణ సూచించారు. మండలకేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో శనివారం జరిగిన అవగాహన సదస్సులో సైబర్ నేరగాళ్ల ఎలా మోసం చేస్తారో విద్యార్థులకు వివరించారు. రకరకాల అధికారుల వేషధారణ కలిగిన ఫొటోలు జోడించి ఫోన్‌కాల్స చేసి మాయమాటలు చెపితే నమ్మి మోసపోవద్దని సూచించారు. భారత ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మహిళల రక్షణ కోసం కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొచ్చిన చట్టాల గురించి ఎస్సై వివరించారు. ముఖ్యంగా షీ టీం ల వల్ల మహిళకు అందుతున్న రక్షణ విషయం విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో చెప్పారు. విద్యార్థులుగా చదువుపై మక్కువ పెంచుకుని బాగా చదువాలని ఆయన సూచించారు. మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

చెప్పుకోలేని సమస్య

ఇందల్వాయి, నవంబర్ 8 (ఆంధ్రజ్యోతి): డిచ్‌పల్లి మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో నెలరోజులుగా మూత్రశాలలు మూసి ఉండడంవల్ల మహిళా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బస్టాండ్‌లోని మూత్రశాలలకు నెలరోజుల నుంచి తాళం వేసి ఉంచారు. దీంతో ప్రయాణికులు మూత్ర విసర్జన ఎక్కడ చేయాలో తెలియక నానా అవస్థలు పడుతున్నారు. డిచ్‌పల్లి బస్టాండ్‌లో ఉన్న దుకాణాల సముదాయాల నుంచి ఆర్టీసీకి కిరాయి రూపంలో లాభం వస్తున్నా.. సమస్యలను మాత్రం పట్టించుకోవడం లేదు. మహిళలు రోజురోజుకు చెప్పుకోలేని ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా నిజామాబాద్ జిల్లా డిపో-1, డీఎం డిచ్‌పల్లి బస్టాండ్‌లో నెలకొన్న సమస్యలను దృష్టిలో పెట్టుకొని పరిష్కరించాలని కోరుతున్నారు. తెలంగాణ యూనివర్సిటీ విద్యార్థులు, మోడల్ స్కూల్ పాఠశాల విద్యార్థులు, నిజామాబాద్‌కు వెళ్లే విద్యార్థులు అధిక సంఖ్యలో వెళ్తుంటారని, మూత్రశాల బంద్ ఉండటం వల్ల ఎవరికి చెప్పుకోవాలో తెలియక ఇక్కట్లు తప్పట్లేదు. ఇకనైనా ఆర్టీసీ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నిజామాబాద్ కల్చరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ప్రగతిశీల భవన ఇతర నిర్మాణ కార్మిక సంఘాల సమైక్య నగర అధ్యక్షుడు మోహన్ డిమాండ్ చేశారు. శనివారం ద్వారకనగర్‌లోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను అమల్లోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తుందని కార్మికులు వ్యతిరేకించాల్సిన అవసరం ఉందని అన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లను కుదించి కార్మిక వర్గానికి తీరని నష్టం చేస్తుందని ఆరోపించారు. ఇప్పుడున్న సదుపాయాలను కాలరాస్తుందని మండిపడ్డారు. నాలుగు లేబర్ కోడ్‌లను ఉపసంహరించకపోతే భవన నిర్మాణ కార్మిక రంగాలు సంఘటితంగా పెద్ద ఎత్తున ఆందోళనలు, ధర్నాలు చేస్తామని అన్నారు. ఈ సమావేశంలో నగర ఉపాధ్యక్షుడు వినయ్, ప్రధాన కార్యదర్శి నర్సింగ్‌రావు, కార్యవర్గ సభ్యులు అరుణ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

దాశరథి జైలును సందర్శించిన రాష్ట్రస్థాయి కవి బృందం

నిజామాబాద్ కల్చరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): దాశరథి కృష్ణమాచార్య గడిపిన ఖిల్లా జైలును శనివారం రాష్ట్రస్థాయి కవి బృందం సందర్శించింది. వికారాబాద్ కేంద్రంగా సాహిత్య వికాసానికి కృషి చేస్తున్న అనంత సాహితీ సాంస్కృతిక వేదిక రాష్ట్రస్థాయి కవి బృందం బాసర కవియాత్రలో భాగంగా ఖిల్లా దాశరథి జైలును సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రముఖ పద్యకవి దూరవేటి మాట్లాడుతూ.. దాశరథి నాడు తెలంగాణ ఉద్యమం కోసం ఇచ్చిన స్ఫూర్తి ప్రతి ఉద్యమంలో కొనసాగిందని అన్నారు. జైలు జీవితం గడిపిన స్థలాన్ని సందర్శించడం ప్రత్యేకంగా భావిస్తున్నామని అన్నారు. దాశరథి రచించిన అగ్ని ధారలో పద్యాలను కవులు గానం చేశారు. అనంతరం ఖిల్లా రామాలయంలో సీతారాముల వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కవులు, సాహితీవేత్తలు ఉన్నారు.


దాశరథి కృష్ణమాచార్యకు నివాళులర్పిస్తున్న కవులు


కేక్ కట్ చేస్తున్న నాయకులు

సీఎం జన్మదిన వేడుకలు

కామారెడ్డిటౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ నియోజకవర్గ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు శనివారం సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. అనంతరం ఒకరినొకరు కేక్ పంచిపెట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం ప్రజాసేవలో నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని కోరారు. ప్రజాపాలనలో రాష్ట్రం అభివృద్ధిలో ముందుకెళ్తుందని అన్నారు. నాయకులు శ్రీనివాస్, విజయ్‌రెడ్డి, సుధాకర్, రవి, మహేష్, రమేష్ పాల్గొన్నారు.

ముడుపు ముడితేనే..
దస్త్రం కదులుతుంది

▸▸ తహసీల్దార్‌కు కమిషన్ ఏజెంట్‌గా ఆపరేటర్లు

▸▸ రూ.2వేలు ఇస్తేనే రిజిస్ట్రేషన్

జుక్కల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జుక్కల్ తహసీల్దార్ కార్యాలయంలో వసూళ్ల పర్వం రాజ్యమేలుతోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. భూములు కొనుగోలు చేసిన రైతుల నుంచి డబ్బులు తీసుకుంటేనే రిజిస్ట్రేషన్లు చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

వసూళ్లు ఎక్కడ అంటే..

రైతులు భూములు కొనుగోలు చేసిన తర్వాత మీసేవలో ప్రభుత్వానికి ఫీజు చెల్లిస్తున్నారు. ఆ తర్వాత ఆన్లైన్‌లో వచ్చిన డాక్యుమెంట్ పేపర్లను తహసీల్దార్ కార్యాలయానికి తీసుకొస్తున్నారు. వాటిని తీసుకున్న ధరణి ఆపరేటర్ రూ.2వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. జుక్కల్ తహసీల్దార్‌కు మధ్యవర్తిగా కార్యాలయంలో పనిచేసే ఆపరేటర్లు రైతుల వద్ద డబ్బులు తీసుకొని కొంత డబ్బు తహసీల్దార్‌కు ముట్టచెప్పి మరికొంత ఆపరేటర్ వాడుకుంటున్నారని ప్రధాన ఆరోపణ.

డబ్బులు ఇవ్వకుంటే పని కాదట..

రిజిస్ట్రేషన్‌కు ఒకవేళ డబ్బులు ఇవ్వకపోతే ఏదో ఒక సాకు చెబుతూ రిజిస్ట్రేషన్లు కావని రైతులను భయపెట్టిస్తున్నారు. చివరికి చేసేదేమీ లేక ముడుపు చెల్లించాల్సిన పరిస్థితి.

ప్రభుత్వం నిబంధనలు గాలికి

రాష్ట్ర ప్రభుత్వం భూభారతి చట్టం తీసుకువచ్చి రైతులకు ఇబ్బంది లేకుండా రిజిస్ట్రేషన్లు జరగాలని భావించింది. అయితే ఈ నిబంధనలను తహసీల్దార్ అధికారులు తుంగలో తొక్కి ఇష్టారాజ్యంగ వ్యవహరిస్తూ భూముల రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. పట్టా భూమి కలిగిన రైతులు స్లాట్ బుక్ చేసుకొని రిజిస్ట్రేషన్‌కి వస్తే ఆపరేటర్‌ను సంప్రదిస్తేనే రిజిస్ట్రేషన్ జరుగుతుందని తెలుస్తోంది. తహసీల్దార్ పరోక్ష అనుమతితో భూముల రిజిస్ట్రేషన్‌లో ఆపరేటర్లు డబ్బులు వసూలుకు తెరలేపారని జుక్కల్ ప్రజలు పేర్కొంటున్నారు.

ప్రత్యేకంగా కోడ్ భాష

తహసీల్దార్ కార్యాలయంలో భూముల రిజిస్ట్రేషన్‌లో కోడ్ భాష అమలు చేస్తున్నారు. డబ్బులు ఇచ్చిన రైతు డాక్యుమెంట్ ఫైలుకు పచ్చ కాగితం పెట్టి గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నారు. ఇలాంటి ఫైల్‌పై తహసీల్దార్ ఇండార్స్మెంట్ చేసిన అనంతరం ధరణి ఆపరేటర్ రిజిస్ట్రేషన్‌కు ప్రాసెస్ స్టార్ట్ చేస్తున్నాడు. డబ్బులు ఇవ్వని రైతు ఫైలుకు ఎర్రటి కాగితం గమ్‌తో అంటించి పంపిస్తే తహసీల్దార్ ఎండార్స్మెంట్ చేయడం లేదట.

డబ్బులు ఇచ్చాక రిజిస్ట్రేషన్



జుక్కల్ తహసీల్దార్ కార్యాలయంలో భూములు కొనుగోలు డాక్యుమెంట్ తీసుకెళ్లినప్పుడు రైతుల పేరుపై రిజిస్టర్ చేయడానికి తహసీల్దార్ ఆపరేటర్ రూ.2వేలు తీసుకుని రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. ఇటీవల మా అమ్మ చనిపోయింది. ఆమె పేరు మీద ఉన్న భూమి పాత రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు పేపర్లు తీసుకెళ్తే తహసీల్దార్, ఆపరేటర్లు కలిసి రూ.2 వేలు ఇచ్చిన అనంతరం నా పేరుపై రిజిస్ట్రేషన్ చేశారు.

- ప్రకాష్ పటేల్, రైతు, లాడేగం

ఫిర్యాదుచేస్తే చర్యలు తీసుకుంటాం

జుక్కల్ తహసీల్దార్ కార్యాలయంలో స్లాట్ బుక్ చేసుకొని భూములు కొన్న రైతుల వద్ద రిజిస్ట్రేషన్ చేసేందుకు ఆపరేటర్లు రూ.2వేలు డబ్బులు తీసుకుంటున్న విషయం నాకు తెలియదు. ఈ విషయమై రైతులు రాతపూర్వకంగా ఫిర్యాదుచేస్తే క్షేత్రస్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

- మారుతి, తహసీల్దార్, జుక్కల్

కాలభైరవం భజే

(5వ పేజీ తరువాయి)

కోసే ఉంది. రోగాల బారిన పడిన వారు 21 రోజులు, 41 రోజులు స్వామి వారికి జలాభిషేకం చేసి ఉదయం, సాయంత్రం స్వామి వారి అష్టకం, పఠిస్తే సర్వ రోగాలు తొలుగుతాయని అపార నమ్మకం.

రథోత్సవం.. అగ్నిగుండాల నిర్వహణ

ఇస్సన్నపల్లి- రామారెడ్డి గ్రామాల ప్రజలు ఇంటికి ఒకరి చొప్పున ముందుకు వచ్చి ఉత్సవాల్లో పాల్గొంటారు. స్వామి వారి రథం లాగడంలో గ్రామానికి చెందిన కుర్మసంఘం వారు గ్రామస్థులు పాల్గొంటారు. రాత్రి 2 గంటల నుంచి ఉదయం 7గంటల వరకు రథాన్నితాళ్లతో లాగుతూ రథాన్ని గ్రామం విధుల గుండా ఊరేగించి ఆలయానికి చేర్చుతారు.

ఉత్సవాల చివరి రోజు అగ్ని గుండాలు నిర్వహిస్తారు. దేవదయ శాఖ ఆధ్వర్యంలో ఎడ్ల బండ్ల పై అడవి నుంచి కట్టెలు తీసుకొచ్చి కుప్పగా పేర్చి రాత్రి రెండు గంటలకు వేద మంత్రాలతో అగ్ని గుండాన్ని ప్రారంభిస్తారు. ఆ అగ్ని గుండం తెల్ల వారి సరిగి పూర్తిగా కాలి నిప్పుగా మారుతుంది. ఉదయం 6 గంటలకు వేద గురువు వేదమంత్రాలతో దండకాలతో తమ ఆధీనంలోకి తీసుకొని గుమ్మడి కాయలు కొట్టి నైవేద్యం పెట్టి అగ్ని గుండం మీద నడుస్తారు.

బంగారు భైరవునికి డోలారోహణము..

ఉత్సవాల సందర్భంగా 12 బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు ఆలయ ఈవో బుర్ల ప్రభురాంచంద్రం గుప్తా ఆధ్వర్యంలో బంగారు భైరవునికి డోలారోహణము నిర్వహిస్తారు. బంగారు భైరవుని విగ్రహ మూర్తిని కామారెడ్డిలోని బ్యాంకు నుంచి ఎస్సై ఆధ్వర్యంలో భారీ బందోబస్తుతో ఆలయానికి తీసుకువచ్చి జన్మదిన వేడుకలు నిర్వహిస్తారు. అనంతరం బంగారు విగ్రహాన్ని బందోబస్తూ మధ్య తిరిగి బ్యాంకుకు తరలిస్తారు. డోలారోహణము సందర్భంగా భక్తులు నగదు, బంగారు ఆభరణాలు కనుకలుగా సమర్పిస్తారు.

ఆలయానికి భక్తులు చేరుకోవడానికి వచ్చే దారులు..

ఉత్సవాలకు వచ్చే భక్తుల కోసం కామారెడ్డి పాత బస్టాండ్, రైల్వే స్టేషన్ల నుంచి ఆర్టీసి డిపో వారు ప్రత్యేక బస్సుల ఏర్పాటు చేశారు. కామారెడ్డి నుంచి ఇస్సన్నపల్లి- రామారెడ్డిలోకి 11 కిలో మీటర్ల దూరం ఉంది. బస్సుతో పాటు ఆటోలు సైతం ఉంటాయి. నిజామాబాద్ వైపు నుంచి వచ్చే భక్తులు 44వ జాతీయ రహదారి నుంచి సదాశివనగర్‌కు ముందు వచ్చే బైపాస్ రోడ్డు దర్గా నుంచి 12 కిలో మీటర్ల దూరంలో ఇస్సన్నపల్లి- రామారెడ్డికి చేరుకోవచ్చు. కరీంనగర్, వరంగల్ జిల్లాల నుంచి వచ్చే వారు కామారెడ్డి పాత బస్టాండ్ నుంచి నేరుగా కాల భైరవ స్వామి ఆలయానికి చేరుకోవచ్చు. హైదరాబాద, మెదక్ నుంచి వచ్చే వారు కొత్త బస్టాండ్ ద్వారా రామారెడ్డి చేరుకొవచ్చు. సికింద్రాబాద్, నాందేడ్ నుంచి రైల్వేల్లో వచ్చే భక్తులు కామారెడ్డి రైల్వే స్టేషన్ ఎదుట గల బస్టాండ్ నుంచి బస్సులో, ప్రైవేటు వాహనాల్లో ఆలయానికి చేరుకోవచ్చు.

కార్యక్రమాల షెడ్యూల్..

కాల భైరవ స్వామి జన్మదిన వేడుకలు నేటి నుంచి 13వ తేది గురువారం వరకు నిర్వహిస్తామని ఆలయ నిర్వాహణాధికారి బుర్ల ప్రభురాంచంద్రం గుప్తా తెలిపారు. 09వ తేది ఆదివారం ఉదయం 6 గంటలకు గణపతి పూజ, కంకణ దారణం, సంతత దాభిషేకం, అగ్నిప్రతిష్ఠా, గణపతి హోమంతో ప్రారంభమై మధ్యాహ్నం 1 గంటలకు బద్ది పోచమ్మ అమ్మ వారికి బోనాలు. 10వ తేది సోమవారం సాయంత్రం 6 గంటలకు లక్షదీపార్చన, రాత్రి 07 గంటలకు సిరిసిల్ల వారి కళ బృందంతో బుర్రకథ కార్యక్రమాలు. 11వ తేది మంగళవారం రాత్రి 8 గంటల నుండి ఇస్సన్నపల్లి, రామారెడ్డి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు. 12వ తేది బుధవారం ఉదయం 6 గంటలకు సంతతధారాభిషేకం, ఉదయం 7:05 నిమిషాల నుంచి 10:30 గంటల వరకు ధ్వజారోహణం, మహా పూజ, దక్ష యజ్ఞ కార్యక్రమాలు, మధ్యాహ్నం ఒంటి గంటకు సింధూర పూజ, 3 గంటలకు డోలారోహణం (తోట్లె),అన్నధాన కార్యక్రమం సాయంత్రం 5 గంటలకు ఎడ్ల బండ్ల ఊరేగింపు, రాత్రి 8 గంటలకు భద్రకాళి పూజ, రాత్రి 9 గంటలకు స్వామి వారి పల్లకీ సేవ, రాత్రి 9:30 గంటలకు ఒగ్గు కథ, రాత్రి 2 గంటల నుండి రథోత్సవం, 13వ తేది గురువారం ఉదయం 6 గంటలకు దక్ష యజ్ఞం (అగ్ని గుండం) 8 గంటల వరకు పూర్ణాహుతి నిర్వహించి వేడులను ముగిస్తారు.

ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం.

నేటి నుంచి ఈ నెల 13వ తేది వరకు జరిగే కాల భైరవ స్వామి జన్మదిన వేడుకలకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశాం. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా క్యూ లైన్ విదానం ఏర్పాటు చేశాం. ఉత్సవాల్లో పాల్గొనే భక్తులకు కావాల్సిన అన్నిరకాల సౌకర్యాలతో పాటు భోజన వసతి కూడా ఏర్పాట్లు చేయడం జరిగింది. ఇస్సన్నపల్లి-రామారెడ్డి గ్రామాల నాయకులు, ప్రజలు పూర్తి సహకరం అందించి ఉత్సవాలను విజయవంతం చేయాలి.

- బుర్ల ప్రభురాంచంద్రం గుప్తా, ఆలయ నిర్వాహణ అధికారి

జైల్ అదాలత్‌లో 38 కేసుల పరిష్కారం

(5వ పేజీ తరువాయి)


ఆయన తెలిపారు. కోర్టుల ద్వారాశిక్షలకు గురైన ఖైదీలు మంచి మార్పుకోసం ప్రయత్నించాలజ్నాజిజూరు. ఒకరి ఆస్తిని, మరొకరి జీవన శైలిని అడ్డుకునే హక్కులు ఎవరికి లేవని, వేరొకరిని గాయపరచి నష్టం చేస్తే చట్టం ఊరుకోదని అన్నారు. స్పష్టమైన ఆధారాలు ఉంటేనే న్యాయస్థానాలు శిక్షలు విదిస్తాయని వివరించారు. స్వేచ్ఛగా జీవించాలని, ఇతరుల స్వేచ్ఛను హరించారాదన్నారు. సమాజంలో అందరితో కలిసి మెలిసి జీవించాలని, సమాజ ప్రగతి పాటు పడాలని ఆయన ఖైదీలకు తెలిపారు. జైల్ సువరింటెండెంట్ చింతల దశరథం మాట్లాడుతూ జైలు అనేది ఇంటి వాతావరణాన్ని, సభ్య సమాజం మధ్యలో జీవిస్తున్నామనే పరిస్థితులను కలిగిస్తుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో జైలర్ ఉపేందర్ రావు, డిప్యూటీ జైలర్ మన్మత్ రావు తదితరులు పాల్గొన్నారు.

కొండెక్కిన కోడిగుడ్డు ధర

(5వ పేజీ తరువాయి)

శుభకార్యాలు, పెళ్లిళ్ల సీజన్ కాకపోవడంతో చికెన్ ధరలు తగ్గుముఖం పట్టాయని చెప్పుకోవచ్చు. దీంతో చికెన్ ధర దిగొచ్చింది. అయితే కోడిగుడ్డు ధర మాత్రం పెరిగింది. ఒక కోడి గుడ్డు ధర హోల్ సేల్‌గా 6 రూపాయలు కాగా, రిటైల్‌గా రూ. 7 పలుకుతుంది. చలికాలంలో కోడిగుడ్ల ధరలు పెరగడం సాధారణమేనని కొందరు వ్యాపారులు చెబుతున్నారు... కానీ సహజంగానే వాటికి డిమాండ్ పెరుగుతోందని పలువురు వ్యాపారులు పేర్కొంటున్నారు. మొన్నటి వరకు కార్తీక మాసం ఉండటంతో ప్రజలు మాంసాహారానికి దూరంగా ఉండటంతో డిమాండ్ పడిపోయిందని, ఫలితంగా చికెన్ ధరలు దిగొచ్చాయని వ్యాపారులు చెబుతున్నారు. ప్రస్తుతం కేజీ చికెన్ ధర రూ. 200లుగా పలుకుతుంది. ఏది ఏమైనా కోడి గుడ్డు ధర పెరగడంతో సామాన్యుడికి ఆర్థిక ఇబ్బందే.

పెత్తందారులను ఎదిరించిన పుల్లారెడ్డి



నివాళులర్పిస్తున్న సీపీఐఎంఎల్ నాయకులు

మోపాల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): భూస్వామ్య పెత్తందారి వర్గాల దౌర్జన్యాలను ఎదురించి పోరాడిన నాయకుడు చంద్ర పుల్లారెడ్డి అని సీపీఐ(ఎంఎల్) నాయకురాలు గోదావరి అన్నారు. శనివారం మాధవనగర్ 4వ డివిజన్ పరిధిలో పుల్లారెడ్డి 41వ వర్ధంతిని పురస్కరించుకొని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 1953 నుంచి కమ్యూనిస్టు పార్టీలో ఉంటూ పాలక వర్గానికి ప్రజల సమస్యలను తెలియజేసి పోరాడిన వ్యక్తి అని కొనియాడారు.ఆయన ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మారుతి, మల్లేష్, నర్సన్న, రాజారెడ్డి, నర్సింలుగౌడ్, సత్యనారాయణ, అనుషవ్వ, షేక్ రజియా, శంకర్, నర్సింలు, కనకయ్య, పాల్గొన్నారు.

ఉదయపు నడకతో ఉత్సాహం.. ఆరోగ్యం


సండే స్పెషల్
SUNDAY SPECIAL



నడకలో పాల్గొన్న శంభాజీ గ్రూప్ సభ్యులు



వ్యాయామం చేస్తున్న వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు



శ్రమదానం చేస్తున్న శంభాజీ గ్రూప్ సభ్యులు

నిజామాబాద్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో 40ఏళ్ల పైబడిన వారు గ్రూపులుగా ఏర్పడి వందేమాతరం, ఆరోగ్య, సన్‌రైజ్, జైభారత్, ఛత్రపతి పేర్లతో వాకింగ్ క్లబ్‌లు ఏర్పాటు చేసుకున్నారు. సభ్యులందరూ క్రమం తప్పకుండా మైదానానికి వచ్చేలా నియమ నిబంధనలను విధించుకున్నారు. అందుకోసం ఎంచుకున్న మైదానానికి ప్రతీ రోజు ఉదయం ఐదు నుంచి 5.50 గంటలలోగా చేరుకొని 6.40 గంటల వరకు అక్కడే తఉండాలి. ఆ సమయంలో 40 నిమిషాలు వాకింగ్, 10 నిమిషాలు విశ్రాంతి, మిగిలిన సమయంలో వామప్, వ్యాయామం, సూర్య నమస్కారాలు, యోగా చేస్తారు. ప్రతీ ఆదివారం వాకింగ్ అనంతరం ఆట విడుపుగా సరదాగా గడుపుతారు. ఇష్టమైన పాటలకు నృత్యం చేస్తారు.

కచ్చితమైన నియమ నిబంధనలు

కొన్ని గ్రూపులలో నియమాలు విధించుకున్నారు. గ్రూప్ సభ్యులు వాకింగ్‌కు రాని రోజు రూ.20 ఫైన్ కట్టాలి. అలాగే డ్రెస్ ధరించకుంటే వంద రూపాయలు చెల్లించాలి. దీంతో పాటు సభ్యులు ప్రతీ నెల రూ. 500 చొప్పున జమ చేసి చిట్టీ కట్టుతున్నారు. అలా పోగు చేసిన డబ్బుతో విహర యాత్రలకు వెళ్తున్నారు. జిల్లాలోని ఆధ్యాత్మిక కేంద్రాలతో పాటు ఇతర రాష్ట్రాలకు కూడా వెళుతున్నారు. అ లాగే సభ్యులు, వారి కుటుంబ సభ్యుల్లో ఎవరైనా అనారోగ్యం బారినపడి, ఆస్పత్రిలో చికిత్స పొందుతుం టే, వారి పరిస్థితిని బట్టి కొంత ఆర్థిక సాయం కూ డా చేస్తున్నారు. సామాజికసేవా కార్యక్ర మాల్లోనూ పాల్గొంటున్నారు.

మార్నింగ్ వాక్‌తో ఎన్నో లాభాలు

ఉదయపు నడకతో చాలా లాభాలున్నాయని వైద్యులు చెప్తున్నారు. ప్రతీరోజు పదివేల అడుగులు నడిస్తే అనారోగ్య సమస్యలు దరిచేరవని అంటున్నారు. ప్రతీ రోజు నాలుగు వేల అడుగులు నడిస్తే ప్రాణాంతక వ్యాధుల్లో 25 శాతం మేర దూరం పెట్టొచ్చని సూచిస్తున్నారు. 2500 అడుగులు వేస్తే గుండె సమస్యల నుంచి తప్పించుకోవచ్చని చెప్తున్నారు. వెయ్యి అడుగులు వేస్తే ఆయుఃప్రమాణం 15 శాతం అధికమైతుందని అంటున్నారు.

సమాజ మార్పులో విద్యార్థుల భాగస్వామ్యం అవసరం



జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

నిజామాబాద్ కల్చరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): అసమానతలు ఉన్న సమాజంలో మార్పు కోసం విద్యార్థులు భాగస్వామ్యం అవసరం ఉందని మానవ హక్కుల వేదిక జిల్లాకార్యదర్శి రమేష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కోటగల్లి లోగల నీలం రాంచంద్రయ్య భవనంలో పీడీఎస్‌యూ 23వ మహాసభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాజ్యాంగంలో విద్యార్థులకు కల్పించిన హక్కులను ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయని, ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయడం లేదని ఆరోపించారు. పాఠశాల స్థాయి నుంచి ఉన్నత చదువుల వరకు విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తూ ప్రజలను విద్యకు దూరం చేస్తుందని అన్నారు. ప్రభుత్వం ఫీజులను నియంత్రించడంలో విఫలమైందని పకడ్బందీగా ఫీజుల నియంత్రణ విషయంలో చట్టాలు తీసుకురావాలని డిమాండ్ చేశారు. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు గౌతం కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్‌లో విద్యకు ప్రతీయేటా నిధులు తగ్గిస్తూ ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేస్తున్నాయని, ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు వనమాల సత్యం, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్‌లు విద్యారంగ సమస్యలపై మాట్లాడారు. నగర అధ్యక్షుడు సాయికృష్ణ, నాయకులు నిఖిల్, మనోజ్, పవన్, సాయికిరణ్, ప్రసాద్, భవాని, ప్రసాద్, ముక్తశ్రీ, సాయిరెడ్డి, నాతన్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు వ్యతిరేకంగా ప్రభుత్వాలు

నిజామాబాద్ కల్చరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ కార్మికుల హక్కులను అడుగడుగునా కాలరాస్తున్నాయని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు సూర్యం, టీయూసీఐ ఆల్ ఇండియా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పద్మ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని కోటగల్లిలోని పద్మశాలి హాస్టల్ భవనంలో నిర్వహించిన రాజకీయ శిక్షణా తరగతులకు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. సంవత్సరానికి 2కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని నరేంద్రమోదీ ఇచ్చిన హామీని ఇప్పటి వరకు నిలబెట్టుకోలేదని మండిపడ్డారు. ప్రభుత్వ సంస్థలను కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేస్తూ కార్మికులకు ఉద్యోగ ఆరోగ్య భద్రతను దూరం చేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి, కేంద్ర ప్రభుత్వం అడుగుజాడల్లోనే నడుస్తూ కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాడని ధ్వజమెత్తారు. రాజకీయ శిక్షణ తరగతులను టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు నరేందర్ ప్రారంభించగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు వనమాల కృష్ణ ప్రారంభ ఉపన్యాసం చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ అమరవీరుల సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ శిక్షణ తరగతుల్లో జిల్లా ఉపాధ్యక్షులు వెంకన్న, రాజేశ్వర్, సహాయ కార్యదర్శిమల్లేష్, కోశాధికారి సాయరెడ్డి, జిల్లా నాయకులు మురళి, రాజేశ్వర్, లింగం, కిరణ్, రెహానా, గోదావరి, గణేష్, సాయిబాబా, రవి, అమూల్య, పద్మ, తదితరులు పాల్గొన్నారు.



జెండాను ఆవిష్కరిస్తున్న టీయూసీఐ నాయకులు

బాలికల వసతిగృహం వద్ద నిరసన



విద్యార్థులతో కలిసి నిరసన తెలుపుతున్న సంఘాల నాయకులు

కామారెడ్డిటౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రంలోని గిరిజన బాలికల వసతిగృహం వద్ద విద్యార్థి సంఘాల నాయకులు శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శుక్రవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు వసతి గృహంలోకి చొరబడి 4సెల్‌ఫోన్‌లు దొంగలించారని, ఈ ఘటనతో విద్యార్థులు భయభ్రాంతులకు గురయ్యారని తెలిపారు. కిందిస్థాయి సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విద్యార్థులు ఆరోపించారు. వసతిగృహంలో సీసీకెమెరాలు పనిచేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఉన్నతాధికారులు స్పందించి విద్యార్థులకు తగిన రక్షణ కల్పించేలా చర్యలు చేపట్టాలన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడి నుంచి వారిని పంపించారు. వసతిగృహ సిబ్బంది అలర్ట్‌గా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు వినోద్‌నాయక్, నాగరాజు, అరుణ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రార్‌పై వేటుకు రంగం సిద్ధం

(5వ పేజీ తరువాయి)

క్రమంలో అనేక అక్రమాలతో పాటు అక్రమ నియామకాలు చేసిన చరిత్ర సదరు రిజిస్ట్రార్‌కు ఉంది. అక్కడ విద్యార్థి సంఘాల ఆందోళనతో ఇక్కడికి వచ్చిన ఆయన అక్కడ అక్రమ నియామకాలను సక్రమం చేసిన చరిత్ర ఉన్న సదరు రిజిస్ట్రార్ ఇక్కడ కూడా 2012 అక్రమ నియామకాలను సక్రమం చేసే బాధ్యతలను భుజాన ఎత్తుకున్నాడు. ఆ క్రమంలోనే అక్రమ నియామకాల కేసు కోర్టులో ఉండగా వాటికి పదోన్నతి కల్పించేందుకు ఏకంగా ప్రభుత్వం చేతనే ఫైల్ సిద్ధం చేసిన ఘన చరిత్ర సదరు రిజిస్ట్రార్‌కు ఉంది. గతంలో ఉన్నత విద్యా శాఖ కమిషనర్‌లుగా పనిచేసిన అధికారులతో సన్నిహిత సంబంధాలు కలిగిన సదరు రిజిస్ట్రార్ పదోన్నతులు కల్పించేందుకు చివరి వరకు ప్రయత్నాలు చేసినట్లు ప్రచారంలో ఉంది. కోర్టు తీర్పు వ్యతిరేకంగా రావడంతో ఏమీ చేయాలో తెలియని స్థితిలో సదరు రిజిస్ట్రార్ ఉన్నట్లు సమాచారం. యూనివర్సిటీకి ఎవరు వైస్ చాన్స్‌లర్‌గా వచ్చినా కొత్త రిజిస్ట్రార్‌ను నియమించడం ఆనవాయితీగా వస్తుండగా, వీసీలు మారినా అతనే రిజిస్ట్రార్‌గా కొనసాగడం గమనార్హం.

గతంలో రిజిస్ట్రార్‌లను మార్చినా...

తెలంగాణ యూనివర్సిటీకి వైస్ చాన్స్‌లర్‌గా పనిచేసి అనేక అవినీతి ఆరోపణలు ఎదుర్కోన్న రవీందర్‌గుప్త చివరికి ఏసీబీకి అధికారులకు పట్టుబడి పదవిని కోల్పోయారు. పదవిలో ఉండగా పాలక మండలికి ఆయనకు అనేక విభేదాలు వచ్చిన సందర్భంలో రిజిస్ట్రార్‌లుగా విద్యావర్ధిని, కనకయ్యల నియమించారు. వారు కొంతకాలం పనిచేసినప్పటికి పాలక మండలి ఆమోదించకపోవడంతో తప్పని పరిస్థితుల్లో రిజిస్ట్రార్‌గా యాదగిరిని నియమించారు. మొదట వివాదరహితుడిగా వర్సిటీ అభివృద్ధికి కృషిచేసిన యాదగిరి, మూడేళ్లుగా వ్యవహారాలను అంతగా పట్టించుకోవడం లేదు. గత రెండేళ్లుగా 2012 అక్రమ నియామకాల ఫైల్‌ను హైదరాబాద్ స్థాయి వరకు తీసుకెళ్లే క్రమంలో ఆయన అనేక ఆరోపణలను ఎదుర్కోంటున్నారు. అక్రమ నియామకాలు అని తెలిసిన వాటికి పదోన్నతులు కల్పించే విషయంలో అనేక విమర్శలు వస్తున్నాయి. గత యేడాది క్రితం వీసీగా వచ్చిన యాదగిరిరావు మొదట్లో రిజిస్ట్రార్ దూరంపెట్టినప్పటికి ఆయనను సైతం మచ్చిక చేసుకుని తన పనులను సదరు రిజిస్ట్రార్ చక్కబెట్టుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. తన పదవిని కాపాడుకునేందుకు సిబ్బంది మధ్య విబేదాలు సృష్టించి గ్రూపులుగా విభజించి సదరు రిజిస్ట్రార్ ప్రయత్నాలు చేస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. అనేక ఆరోపణల నేపథ్యంలో సదరు రిజిస్ట్రార్ పనిచేసిన కాలంలో చేసిన ఖర్చులు, ఆయన ఆస్తులపై విజిలెన్స్ విచారణకు రంగం సిద్ధమవుతున్నట్లు సమాచారం.

నేడు ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది పథ సంచలన్

(5వ పేజీ తరువాయి)

ఫిష్ బిల్డింగ్, ఆంజనేయస్వామి ఆలయం, పాలిటెక్నిక్ కళాశాల, నీలకంఠేశ్వర ఆలయం, ఉమెన్స్ కాలేజ్, నారాయణ స్కూల్, శ్రీచాత్తాదా వైష్ణవ సంఘం, రైతుబజార్ మీదుగా హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ వరకు కొనసాగనుంది. పెద్ద ఎత్తున సంఘ్ కార్యకర్తలు, ప్రతినిధులు హాజరుకానున్నారు.

13న ప్రజానాట్య మండలి జిల్లా మహాసభలు

నిజామాబాద్ కల్చరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రజా నాట్య మండలి జిల్లా 10వ మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి సిర్పలింగం పిలుపునిచ్చారు. శనివారం జిల్లాకేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 13వ తేదీన న్యూ అంబేద్కర్ భవన్‌లో మహాసభలు జరుగుతాయని పేర్కొన్నారు. మహాసభలకు కళాకారులు, కళాభిమానులు, ప్రజాసంఘాలు, విద్యార్థులు, మేధావులు, నాయకులు హాజరుకావాలని కోరారు. ఈ సమావేశంలో ప్రజానాట్యమండలి ప్రతినిధులు సుదర్శన్, రాధాకృష్ణ, చంద్రశేఖర్, నర్సారెడ్డి, నర్సింగ్, మధన్‌మోహన్, అశోక్ తదితరులున్నారు.



మాట్లాడుతున్న ప్రజా నాట్య మండలి నాయకులు

లాడ్జిలో వ్యభిచారం

ఇందూర్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): నగరంలోని రైల్వేస్టేషన్ పరిధిలో ఉన్న ఓ లాడ్జిలో వ్యభిచారం జరుగుతుందన్న పక్కా సమాచారం మేరకు ఒకటో ఠాణా పోలీసులు శనివారం రాత్రి తనిఖీలు చేశారు. ఒకటో టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి తన సిబ్బందితో కలిసి లాడ్జిపై దాడి చేయగా.. ఓ జంట పట్టుబడింది. దీంతో మహిళతోపాటు విటుడు, లాడ్జి మేనేజర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

పేకాట ఆడుతున్న ఐదుగురి అరెస్ట్

ఇందూర్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఒకటవ టౌన్ పరిధిలో ఉన్న గీతాభవన్ కాంప్లెక్స్‌లో శనివారం రాత్రి పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారంరాగా 1 టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి సిబ్బందితో కలిసి కాంప్లెక్స్‌లో దాడులు చేపట్టారు. పోలీసుల తనిఖీల్లో ఆరుగురు పేకాట ఆడుతూ పట్టుబడ్డారు. వారి వద్ద నుంచి రూ.6 వేల నగదు, ఐదు సెల్‌ఫోన్లు, మూడు ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

వృద్ధుడు అదృశ్యం.. కేసు నమోదు

మోపాల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మోపాల్ మండలంలోని సిర్పూర్ గ్రామానికి చెందిన ఈర్ల సాయిలు కనిపించడం లేదని కుమారుడు ఈర్ల శ్రీనివాస్ ఫిర్యాదు చేసినట్లు ఎస్సై సుశ్మిత శనివారం తెలిపారు. ఈనెల 6వ తేదీన పొలం వద్దకు వెళ్లి వస్తానని చెప్పి తిరిగి ఇంటికి రాలేదని అన్నారు. ఇంటి నుంచి బయటకు వెళ్లిన సాయిలు తిరిగి రాకపోవడంతో చుట్టుపక్కల గ్రామంలో వెతికిన ఆచూకి లభించకపోవడంతో బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



సాయిలు (ఫైల్)

ఓటు వినియోగంపై అవగాహన ఉండాలి



ఓటు వినియోగంపై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

సదాశివనగర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి ఓటు హక్కు వినియోగంపై అవగాహన కలిగి ఉంటే తమ కుటుంబ సభ్యులకు ఓటు వినియోగంపై క్లుప్తంగా వివరించే అవకాశం ఉందని సాయివిజ్ఞాన్ పాఠశాల కరస్పాండెంట్ విష్ణువర్ధన్ అన్నారు. శనివారం పద్మాజీవాడిలోని పాఠశాలలో విద్యార్థులకు ఎన్నికల నిర్వహణపై అవగాహన కలిగించేందుకు మాస్ ఎలక్షన్ కార్యక్రమాన్ని నిర్వహిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు పుస్తక పరిజ్ఞానమే కాకుండా ఎన్నికల పట్ల ప్రాక్టికల్ అవగాహన కొరకు పూర్తి ఎన్నికల ప్రక్రియను ఒక క్రమ పద్దతిలో నిర్వహించామన్నారు. ముందుగా ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసి నామినేషన్లు, ఉపసంహరణ, ప్రచారం, పోలింగ్, ఫలితాల విడుదల తదితర కార్యక్రమాలు నిర్వహించాన్నారు. విద్యార్థులకు గుర్తులను కేటాయించామన్నారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారని అన్నారు.

సినిమా గైడ్

దేవి : జటాధర (9.30, 1.45, 6.00, 10.15)
విజయ్ : ది గర్ల్‌ఫ్రెండ్ (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : ప్రేమిస్తున్న (11.00, 6.00)
: ప్రిడేటర్ బ్యాడ్‌ల్యాండ్ (2.00, 9.00)
లలితామహాల్ : మాస్‌జాతర (11.15, 2.15, 6.15, 9.15)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్

స్క్రీన్-1 : ఆర్యన్ (11.00), : మాస్ జాతర (1.30, 7.30)
: ది గర్ల్‌ఫ్రెండ్ (4.30, 10.30)
స్క్రీన్-2 : బాహుబలి ది ఎపిక్ (12.45), ది గ్రేట్ ప్రివెడ్డింగ్ షో (4.45)
: డైస్ ఇరాయ్ (7.30), : జటాధర (10.30)
స్క్రీన్-3 : ప్రిడేటర్ బ్యాడ్‌ల్యాండ్స్ (ఇంగ్లీష్-3డి) (11.00, 10.40)
: ది గర్ల్‌ఫ్రెండ్ (1.30), : జటాధర (4.20),
: బాహుబలి ది ఎపిక్ (6.50)

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణుమాల్)

స్క్రీన్-1 : ప్రిడేటర్ బ్యాడ్‌ల్యాండ్స్ (ఇంగ్లీష్-3డి) (11.00, 6.50)
: ప్రిడేటర్ బ్యాడ్‌ల్యాండ్స్ (తెలుగు-3డి) (1.30)
: ఆర్యన్ (4.00), : బాహుబలి ది ఎపిక్ (9.20)
స్క్రీన్-2 : జటాధర (10.50), ది గర్ల్‌ఫ్రెండ్ (1.45, 4.40, 7.35, 10.30)
స్క్రీన్-3 : ఫోనెక్స్ అసాధ్యుడు (11.20), : కృష్ణలీల (1.55)
: జటాదర (4.35, 7.30), : మాస్ జాతర (10.25)
స్క్రీన్-4 : డైస్ మిరాయ్ (11.05, 7.35), : ది గ్రేట్ ప్రివెడ్డింగ్ షో (1.45) : మాస్ జాతర (4.30), : ప్రేమిస్తున్న (10.20)



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.1,22,100	రూ.1,11,800	రూ.1580

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.90	రూ.180	రూ. 200
వెన్‌కాబ్(కిలో)	రూ.100	రూ.190	రూ. 210

